క్లుప్తంగా

యువజన విభాగ అధ్యక్షుల నియామకం

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యువజన విభాగ అధ్యక్షులను ఎన్నుకున్నారు. వినుకొండ పట్టణం యువజన విభాగ అధ్యక్షునిగా అత్తర్ నాగూర్, శావల్యాపురానికి మల్లిశెట్టి నరేష్, ఈపూరు కొండమీద తులసి, బొల్లాపల్లి ఆళ్ల సాంబిరెడ్డి, నూజెండ్ల నీలం సతీష్‌లను ఎంపిక చేయడం జరిగింది. నూతనంగా ఎంపికైన అధ్యక్షులను స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువజన విభాగ అధ్యక్షులుగా నియమితులైన వారందరూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, పార్టీ గెలుపు కోసం, జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేయడం కోసం అహర్నిశలు కష్టపడి పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో వినుకొండ విద్యార్థుల ప్రతిభ



వినుకొండ(నూజెండ్ల): నరసరావుపేట పట్టణంలో నిర్వహించిన జిల్లాస్థాయి పల్నాడు బాలోత్సవ్ పోటీల్లో పట్టణానికి చెందిన గీతమ్స్ హైస్కూల్ విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనపరిచినట్లు గీతమ్స్ విద్యాసంస్థ కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి తెలిపారు. విజేతలైన లీలాసాగర్, మణికంఠ, మేఘన, హారిక, అక్షయ, నవ్యశ్రీ, మహిజ, ఐ.నవ్యశ్రీ, నిఖిల్ అభిరామ్, జీవన శ్రీలను అభినందించారు.

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి మంగళవారం క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలకు విశేష స్పందన లభిస్తుందని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో బహుమతులు అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సుందరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు రామిరెడ్డి, అధికారులు, క్రీడాకారులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవ్‌లో బహుమతుల పంట

చిలకలూరిపేటటౌన్: మండలంలోని రాజాపేట మండల పరిషత్ ప్రాథమిక(ఉర్దు) పాఠశాలల విద్యార్థులు పలు విభాగాల్లో సత్తాచాటి విజేతలుగా నిలిచారు. ఇటీవల పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిర్వహించిన బాలోత్సవం వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ విభాగాల్లో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బహుమతుల్ని కైవసం చేసుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం జహాబేగం తెలిపారు. కథ చెప్పడం విభాగంలో ప్రథమ, అభినయ గేయం పోటీల్లో తృతీయస్థానాల్లో దివ్యశ్రీ విజేత కాగా, అభినయ గేయం విభాగంలో నవ్య సాహితి ప్రోత్సాహక బహుమతి, అలాగే ఫ్యాన్సీడ్రెస్‌లో సాధీప మూడో బహుమతి సాధించింది. ఏకోపాధ్యాయ పాఠశాల అయినప్పటికీ విద్యార్థుల చేత సాధన చేయించి బహుమతులు సాధింపచేసిన పాఠశాల హెచ్‌ఎం జహాబేగంతో పాటు విజేతలను ఎంఈవోలు కె.లక్ష్మీ, రత్నకావ్య,గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.

వడ్డీ మినహాయింపును సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట: పురపాలక పరిధిలో 2023-24 ఆర్థిక ఏడాదిలో రెండో అర్ధసంవత్సరానికి ఇప్పటికీ ఆస్తిపన్ను, ఖాళీస్థలాలు, కుళాయి పన్నులు చెల్లించని వారు డిసెంబరు 31లోగా చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు మంగళవారం కోరారు. కేవలం ఐదురోజులు మాత్రమే వడ్డీ మినహాయింపు పొందేందుకు అవకాశం ఉందన్నారు.

షాపులో నగదు అపహరణ

రొంపిచర్ల: మండలంలోని మర్రిచెట్టుపాలెం గ్రామంలోని వరికూటి శ్రీనివాసరెడ్డికి చెందిన షాపులో సోమవారం రాత్రి దొంగలు పడి రూ.20 వేల రూపాయల నగదు అపహరించారు. షాపుకు వెనుక భాగాన ఉన్న తలుపును పగులగొట్టి దొంగ లోపలికి ప్రవేశించాడు. క్యాష్ పెట్టెలో ఉన్న రూ.20 వేల రూపాయల నగదును దొంగిలించాడు. దొంగ తెలివిగా సీసీ కెమెరాల దిక్కును మార్చాడు. యజమాని శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన మండల పూజలు

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో మంగళవారం వార్షిక మండల ముగింపును పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యాభిషేకం, కలశేన ఉష పూజ, పూర్ణాహుతి, నవవిధ అభిషేక సహిత సహస్ర కలశాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం దివ్య పదునెట్టాంబడి పడిపూజ వైభవంగా జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

గ్రామీణ క్రీడాకారుల కోసమే ఆడుదాం-ఆంధ్ర

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో ఆటల పోటీలు ప్రారంభం
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు



రొంపిచర్లలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



కొండాయపాలెంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు



శావల్యాపురంలో క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



బొల్లాపల్లిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి ఓబుల నాయుడు



బొల్లాపల్లిలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



చిలకలూరిపేటలో సన్మానం పొందిన క్రీడాకారులతో మల్లెల రాజేష్‌నాయుడు



నాదెండ్ల లో పోటీలు ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి బీజే బెన్ని, ఎంపీపీ రాణి



ముప్పాళ్లలో క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి, ప్రజాప్రతినిధులు



యడ్లపాడులో క్రీడల్ని లాంఛనంగా ప్రారంభిస్తున్న ఎంపీపీ రుూన్సీ

వినుకొండ(నూజెండ్ల): గ్రామీణ ప్రాంతాల్లో యువతీ యువకుల ప్రతిభను వెలికితీసి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ఆవరణలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను ఎమ్మెల్యే బొల్లా ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్, క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాలను బయటకు తీసి గ్రామస్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసి గుర్తింపు తెచ్చేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి లాంఛనంగా క్రీడాపోటీలను ప్రారంభించినట్లు చెప్పారు. వినుకొండ ప్రాంతం నుంచి క్రీడాకారులు మంచి ప్రతిభను కనపరిచి రాష్ట్రస్థాయిలో మంచి బహుమతులు అందుకోవాలని పిలుపునిచ్చారు. వినుకొండలో విద్యార్థులు ఆడుకునేందుకు స్టేడియం నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీరాములు, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గాబ్రియేలు, కౌన్సిలర్ షకీలా దస్తగిరి, ఎంపీపీలు జయశ్రీ వెంకట రామిరెడ్డి, జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, సొసైటీ చైర్మన్ పిచ్చిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకయ్యలతో పాటు పీఈటీలు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: క్రీడల వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. మండలంలో అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుండి, గ్రామాల నుండి వచ్చిన క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. నాయకులతో కలిసి బాల్ బాడ్మింటన్ క్రీడ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి. అంకారావు, ఎంపీపీ గడ్డం వెంకట్రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పడాల శివారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బియ్యం సుభాని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కురుగుంట శ్రీనివాసరెడ్డి, వీఆర్వో పడాల సుబ్బారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్‌లు పడాల చక్రారెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పచ్చవ రవీంద్ర బాబు, గెల్లి కోటిరెడ్డి, చపారపు సంజీవరెడ్డి, కల్లి వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, హనిమిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ముప్పాళ్ల గ్రామంలోని ధనలక్ష్మి కాలేజీ నందు నిర్వహించిన ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి, ఎంపీడీవో రంగ నాయకులు, జడ్పీటీసీ చౌడయ్య, ఈపూరు సొసైటీ చైర్మన్ బొల్లా వెంకటరాధాకృష్ణ, సర్పంచ్ రమ్య, వెంకయ్య, ఎంపీటీసీలు జ్యోతి నరసింహా రావు, జయ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి హైమావతి, గ్రామ సచివాలయ సిబ్బంది, పెద్దలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొండాయపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని బొగ్గరం హైస్కూల్ మైదానంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో కొండాయపాలెం సర్పంచ్ కేతినేని వెంకట్రావు, బోడెపూడివారిపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు, బొగ్గరం వైఎస్సార్ సీపీ నాయకులు మండపాటి కోటేశ్వరరావు, రామారావు, సచివాలయ పంచాయతీ కార్యదర్శి అనురాధ, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, పీడీ మద్దం వెంకటేశ్వర్లు, హెల్త్ డిపార్ట్‌మెంట్, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించటం సంతోషంగా ఉందని మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఐదు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సారథ్యంలో ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకులను క్రీడల్లో వారి స్ఫూర్తిని వెలికితీయటానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. మండలంలోని కారుమంచి గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో క్రీడా పోటీలను ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల పరిచయ కార్యక్రమ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, మల్లావరపు విశ్రాంతం, ఎంపీటీసీ సభ్యులు బాబురావు, శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, మాజీ ఎంపీపీ గుత్తా కోటేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఎంఈవో యం.సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టేటి రవి, పొట్టిపాటి శ్రీను, వ్యాయామ ఉపాధ్యాయులు రాగుల రాధాకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి పెంపొందించేందుకు ఆడుదాం ఆంధ్రా

బొల్లాపల్లి: యువతలో క్రీడలపట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు దోహదపడతాయని ప్రత్యేక అధికారి ఎస్.ఓబుల నాయుడు తెలిపారు. మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. క్రీడా పోటీలను ప్రారంభించి స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ యువతలో మరుగునపడిన క్రీడా నైపుణ్యతను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడలను సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. మండలంలో సచివాలయాల పరిధిలో క్రికెట్ పురుషులు 75, మహిళలు 2, కబడ్డీ పురుషులు 25, మహిళలు 2, బ్యాడింటెన్ పురుషులు 27, మహిళలు 11, వాలీబాల్ పురుషులు 16, మహిళలు 3, ఖోఖో పురుషులు 2, మహిళలు 8 టీంలు ఈ కార్యక్రమంలో నిర్వహించే పోటీల్లో తలపడతాయన్నారు. ప్రత్యేక నైపుణ్యత కనపరచిన టీంలను నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో పాల్గొనే అవకాశం ఉందని, నియోజకవర్గస్థాయి నుంచి బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. జనవరి 10 వరకు మండల స్థాయిలో పోటీలు నిర్వహణ ఉంటుందన్నారు. తొలుత అయ్యన్నపాలెం, వడ్డెంగుంట సచివాలయాలకు చెందిన క్రికెట్ టీంలు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గోవింద నాయక్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గురవయ్య, సర్పంచ్ సాయిబాబు, బి.గురవయ్య, జార్జీ, తిప్పిశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: గ్రామీణ క్రీడాకారులను గుర్తించి వారిని జాతీయ అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రూపొందించారని ఎంపీపీ పిడతల రుూన్సీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా (మన అందరి ఆట) మెగా టోర్నమెంట్ పోటీలు మంగళవారం ఆరంభం అయ్యాయి. మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలోని 8 క్రీడా మైదానాల్లో ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, స్థానికపెద్దలు, అధికారులు ఈ క్రీడాపోటీలకు రిబ్బన్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా క్రీడా పోస్టర్‌ను ఆవిష్కరించి, క్రీడా కిట్లను పంపిణీ చేశారు. అనంతరం క్రీడాకారులచే ప్రతిజ్ఞ చేయించారు. యడ్లపాడు, ఉన్నవ, తిమ్మాపురం, కారుచోల, సొలస జెడ్పీహైస్కూల్స్, కొత్తసొలస ఎంపీయూపీ స్కూల్‌లోని క్రీడామైదానాల్లో వీటిని నిర్వహించారు. మండల కేంద్రమైన యడ్లపాడులో మండల ప్రత్యేక అధికారి రాధారాణితో పాటు ఎంపీపీ రుూన్సీ, సర్పంచ్ కె.హేమ, తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు, ఎంపీడీవో వై హనుమారెడ్డి, బోయపాలెంలో సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు, మిగిలిన ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పెద్దలు హాజరై ప్రారంభోత్సవ సమావేశంలో మాట్లాడారు.

వినుకొండలో...



వినుకొండలో ఆటలను ప్రారంభిస్తున్న మండల ప్రత్యేకాధికారి రవిబాబు

వినుకొండ(నూజెండ్ల): ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నూజెండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆటల పోటీలను మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ బి.రవిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, ఈవోపీఆర్‌డీ టి.విరకుఆర్, ఎంఈవో చంద్రశేఖరరావు, సర్పంచ వీర్ల వెంకటస్వామి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వెంకటరత్నం, పీడీ వీరాంజనేయులు, పీఈటీ అరుణ, పంచాయతీ కార్యదర్శి కె. చిట్టిబాబు, గ్రామసచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: ఆడుదాం ఆంధ్రతో క్రీడాకారుల్లో స్ఫూర్తి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను పట్టణంలోని చౌదరయ్య పబ్లిక్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం, ఉత్సాహం చేకూరతాయని వివరించారు. దేశంలోనే మెగా టోర్నీగా ఆడుదాం ఆంధ్రాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేశారని వివరించారు. ముందుగా విద్యాదాత చౌదరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని కొద్ది సేపు ఆటలు ఆడి ఉత్సాహపరిచారు.

క్రీడాకారులకు సన్మానం...

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా వివిధ క్రీడా పోటీలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని తిలకించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డిప్యూటీ డీఈవో కె వేణుగోపాల్, అధికార భాషా సంఘం సభ్యుడు కత్తి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, పంగుళూరి వెంగళరాయుడు స్కూల్ డైరెక్టర్ ప్రభాకరరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: మండలంలోని పదహారు సచివాలయాల పరిధిలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలను మండల ప్రత్యేకాధికారి బీజే బెన్నీ ప్రారంభించారు. ముందుగా వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను క్రీడాకారులతో ఆడి ఉత్సాహ పరిచారు. ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, తహసీల్దార్ ఎన్. నాగమల్లేశ్వరరావు, ఎంఈవోలు ఆంజనేయులు, కృష్ణారెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించి ఫ్రెండ్లీ గేమ్ ఆడారు. వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖోలకు గాను తొలిరోజు వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలను మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. క్రీడాకారులతో క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ ఆదంవలి, స్కూల్ పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, పీడీ వేణుగోపాల్, పీఈటీ జాస్తి శ్రీకాంత్, నాయకులు కొండెపాటి నాగయ్య, సుబ్రహ్మణ్యం, మంద్రు జ్ఞానయ్య, బొంతా బాబు, కార్యదర్శి ఆర్వపల్లి శేఖర్, పాల్గొన్నారు.

దినచర్యలో భాగం కావాలి



కోటప్పకొండలో క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: ప్రతి ఒక్కరి దినచర్యలో వ్యాయామం భాగం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మండలంలోని కోటప్పకొండ త్రికోటేశ్వర జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి వాలీబాల్, క్రికెట్ ఆడి సందడి చేశారు. కబడ్డీ క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జగనన్న సురక్ష పేరుతో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి గ్రామ సచివాలయంలో వైద్య శిబిరాలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి జగన్ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలకు అవకాశం కల్పించాలన్నారు. రోజుకు గంట సమయం ఆటలకు కేటాయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఫిట్‌నెస్ లేకపోవడం వలనే చిన్న వయస్సులోనే గుండెపోటుతో యువకులు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. క్రీడల ద్వారా శరీరానికి వ్యాయామం లభిస్తుందన్నారు. 47 రోజుల పాటు ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఆటల పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు దాసరి శ్రీనివాసరావు, మోపూరి పిచ్చయ్య, కురుగుంట్ల మాణిక్యాలరావు, భవనం నర్సిరెడ్డి, జెక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మేకల మురళి, డి.రమేష్, ఎంపీటీసీలు సేతు, గుడిపుడి సతీష్‌బాబు, షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు ఘననివాళి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



అడ్డరోడ్డు సెంటర్‌లో రంగా విగ్రహం వద్ద మాట్లాడుతున్న మల్లెల రాజేష్‌నాయుడు

నరసరావుపేట: పేద, బడుగు, బలహీనవర్గాలకు ఏ ఆపద వచ్చినా నేనున్నానని ముందుకు వచ్చే మానవతావాది వంగవీటి మోహన్‌రంగా అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. స్వర్గీయ వంగవీటి మోహన రంగా 35వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గుంటూరురోడ్డు, సత్తెనపల్లిరోడ్డు, చెక్‌పోస్ట్ సెంటర్, బరంపేట రిక్షా సెంటర్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్‌కే ఆంజనేయులు, రామిశెట్టి కొండ, పుల్లంశెట్టి శ్రీను, తిప్పరయ్య, గుదే రామయ్య, పలువురు కాపు నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరై నివాళులు అర్పించారు.

టీడీపీ క్షుద్ర రాజకీయాలకు బలయ్యారు

చిలకలూరిపేట: పేద బడుగు, బలహీనవర్గాల కోసం జీవితాంతం పాటుపడిన వంగవీటి మోహన రంగా టీడీపీ క్షుద్రరాజకీయాలకు బలి అయ్యారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత వంగవీటి మోహనరంగా వర్ధంతిని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్, విశ్వనాథ సెంటర్, భాస్కర్ సెంటర్లలో ఉన్న రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ దేవినేని శంకరరావు, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు కాట్రగడ్డ మస్తాన్‌రావు, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, కొమరవల్లిపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్ -1 పఠాన్ తలహాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): పేద ప్రజలకు అండగా నిలబడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎనలేని అభిమానులను సొంతం చేసుకున్న ఘనత దివంగత నేత కాపునాయకులు వంగవీటి మోహనరంగాకే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వంగవీటి మోహనరంగా 35వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని ముండ్లమూరు డౌన్‌లో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాపు నాయకులు ఆర్.శ్రీను, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గాబ్రియేలు, కౌన్సిలర్ షకీలాదస్తగిరి, ఎంపీపీలు జయశ్రీ వెంకటరామిరెడ్డి, జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, సొసైటీ చైర్మన్ పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళను సద్వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ఉప్పలపాడులో 85 మంది రైతులకు పంపుసెట్ల పంపిణీ



రైతులకు పంపు సెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని పాత ఉప్పలపాడు గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకం కింద ఎంపికైన 85 మంది రైతులకు మోటారు పంపుసెట్‌లను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద రైతులకు మేలు చేసే విధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అన్నివిధాలా ప్రభుత్వ పథకాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అలాగే వైఎస్సార్ జలకళ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది రైతులకు బోర్లు వేయించడమే కాకుండా పొలంలోకి విద్యుత్ వసతితో పాటు మోటార్లు కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రూ. 3.70 లక్షల విలువైన మోటారు పంపు సెట్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జయరామిరెడ్డి, జెడ్పీటీసీ సుబ్బులు రామయ్య, సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, పారా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్మశాన స్థల ఆక్రమణను అడ్డుకోండి



చిలకలూరిపేట: పట్టణంలోని పురుషోత్తమపట్నంకు చెందిన శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని, దీనిని అడ్డుకోవాలని తహసీల్దార్ జి.సుజాతకు మంగళవారం పలువురు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థలదాత కుటుంబ సభ్యులు విడదల శ్రీనివాసరావు, విడదల రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు క్లస్టర్-2 విడదల కమలేంద్ర మాట్లాడుతూ పురుషోత్తమపట్నం గ్రామ సర్వేనంబర్ 325 -3ఈ లో 20 సెంట్లు దాత విడదల నరసింహారావు శ్మశానం నిమిత్తం ఇచ్చి ఉన్నారని తెలిపారు. ఈ స్థలం పురుషోత్తమపట్నంలోని శ్మశానికి ఆనుకొని ఉంటుందని చెప్పారు. తమ ముత్తాత విడదల నరసింహారావు ఆయన కుటుంబానికి చెందిన అంత్యక్రియలు నిర్వహించేందుకు ఈ స్థలాన్ని వదిలినట్లు వివరించారు. ప్రస్తుతం ఆ స్థలం కొందరు వ్యక్తులు గ్రావెల్ తోలి ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఫిర్యాదు చేశారు. రికార్డుల్లో సైతం పేరు మార్పుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వినతి పత్రం స్వీకరించిన తహసీల్దార్ జి సుజాత విచారణ నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో మదర్‌థెరిస్సా కాలనీకి చెందిన జొన్నలగడ్డ శ్యాముల్ (28) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంటాడు. ఒంగోలుకు చెందిన సుమతితో ఎనిమిది సంవత్సరాల కిందట వివాహమైంది. భార్యతో మనస్పర్థలతో భార్య నెల రోజుల కిందట పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి 9గంటలకు తల్లి భోజనం పెట్టి వెళ్లింది. ఉదయం 7.30 గంటలకు తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా బెడ్ రూమ్‌లో సీలింగ్ ఫ్యానుకు చీరెతో ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.